

మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

# కేసీఆర్‌తోనే తెలంగాణ సుభిక్షం

**మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు**

సిద్దిపేటరూరల్, మార్చి31: గులాబీ అధినేత కేసీఆర్‌తోనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట రూరల్ మండలం సీతారాంపల్లి శంకర్‌నగర్‌లోని పెద్దమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాక ముందు భూములన్నీ ఏడారిగా ఉన్నాయని, కేసీఆర్ కట్టిన కాళేశ్వరంతో గోదావరి నీళ్లు ప్రతి గ్రామానికి రావడంతో పొలాలు పచ్చబడ్డాయని గుర్తుచేశారు. కేసీఆర్ తెగించి కొట్లాడి తెలంగాణ రాష్ట్రం తెచ్చాడని, మండుటెండల్లోసైతం చెరువుల్లో నీళ్లు మత్తడి దూకేలా చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, ఎల్లం, నేతలు పాల్గొన్నారు.

**హరీశ్‌రావు వాహనం తనిఖీ**

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి) మార్చి 31: రామాయంపేట నుంచి సిద్దిపేటకు ఆదివారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు కారులో వెళ్తుండగా అక్బర్‌పేట-భూంపల్లిలోని చౌరస్తాలో ఎన్నికల అధికారులు, పోలీసులు కారును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు ఎన్నికలు అధికారులకు సహకరించారు.



అక్బర్‌పేట-భూంపల్లిలోని చౌరస్తాలో కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

## బస్సుపై నుంచి పడి వ్యక్తి మృతి

చేర్యాల, మార్చి 31 : పట్టణానికి చెందిన సూర్న కనకయ్య(60) అనే వ్యక్తి బస్సు పై నుంచి పడి మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. జగదేవ్‌పూర్‌లో కనకయ్య బంధువు ఒకరు మృతి చెందడంతో అంత్యక్రియలకు హాజరై తిరిగి చేర్యాల బస్టాండ్‌లో బస్సు దిగాడు. చేర్యాల పట్టణంలోని పాత బస్టాండ్ వద్దకు చేరుకునేందుకు జనగామ వైపునకు వెళ్లే బస్సులో టౌన్‌కు వస్తున్న సమయంలో తాను దిగాల్సిన స్టాఫ్ దాటిపోతుందని భావించి కనకయ్య ఒక్కసారిగా బస్సు దిగేందుకు యత్నించి తీవ్రంగా గాయపడ్డాడు.ఈ ఘటనలో కనకయ్య తీవ్రంగా గాయపడడంతో బంధువులు సిద్దిపేట దవాఖానకు తరలించడంతో అక్కడ వైద్యులు చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించాలని సూచించారు. క్షతగాత్రుడు కనకయ్యను బంధువులు హైదరాబాద్‌కు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడు.

## పేద ముస్లింలకు బట్టలు పంపిణీ

మిరుదొడ్డి, మార్చి 31 : పవిత్ర మాసం రంజాన్ పండుగను ముస్లింలు ఆనందంగా జరుపుకోవాలని దుబ్బాక నియోజకవర్గం మసీద్ కమిటీ అధ్యక్షుడు ఎం డీ.జాకీర్ హుస్సేన్ అన్నారు. ఆదివారం మిరుదొడ్డి టౌన్‌లో ఆయా గ్రామాలకు చెందిన ముస్లింలకు డాక్టర్ వాహెద్ హుస్సేన్, మహ్మద్ సాహెబ్ హుస్సేన్, అహ్మద్ ఇస్మాయిల్, రెహమాన్ ఆజం, మోసిన్ల సహకారంతో బట్టలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేసి రూ.90 వేల ఆర్థిక సహాయం అందజేశారు కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ సభ్యుడు హుస్సే న్, మునీర్, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మిరుదొడ్డిలో ముస్లింలకు బట్టలను పంపిణీ చేస్తున్న ముస్లింలు దాతలు

## అ'పూర్వ' సమ్మేళనం



చెప్యాలలో పూర్వ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మిరుదొడ్డి, మార్చి 31 : మండల పరిధిలోని చెప్యాల జడ్పీ పాఠశాలలో ఆదివారం 1984-1985 టెన్త్ పూర్తిచేసిన పూర్వ విద్యార్థులు ఘనంగా ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని గురువులను ఘనంగా సన్మా నం పాదాభివందనం చేశారు. కార్యక్రమం లో మిరుదొడ్డి ఎంపీపీ గజ్జల సాయిలు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## పంచాంగం ఆవిష్కరణ

గజ్వేల్, మార్చి 31: శ్రీకోతినామ సంవత్సరానికి సంబంధించిన నూతర పంచాంగాన్ని వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు జగ్గయ్యగారి శేఖర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి నవీన్, సభ్యులు గోలి సంతోష్, వెంకటేశం, భిక్షపతి, ఉప్పల మెట్టయ్య, ఎర్రం శ్రీనివాస్, తదితరులు, పాల్గొన్నారు.



పంచాగాన్ని ఆవిష్కరిస్తున్న వాసవిక్లబ్ సభ్యులు

## కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి31: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర లభిస్తున్నదని ఐకేపీ ఏపీఎం బాబురావు అన్నారు. ఆదివారం ధూళిమిట్ట మండలంలోని లింగాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ మహేందర్, వీవో అధ్యక్షురాలు ఎర్ర లక్ష్మి, మహిళా సంఘం సభ్యులు, హమాలీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



లింగాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం బాబురావు

# సాయంకోసం ఎదురుచూపు

- ఎండిన పంటలపై అధికారుల సర్వే
- వరి మాత్రమే నమోదు చేస్తున్న అధికారులు
- మొక్కజొన్న తదితర పంటలపై మౌనం

హుస్నాబాద్ టౌన్, మార్చి 31: కండ్ల ముందే పంటలు ఎండిపోతున్నాయి.... ఎండిన పంటలను ఇప్పటికే అనేక మంది రైతులు గొర్లు, బర్లు, ఆవుల మేతకు వదిలివేశారు.. వ్యవసాయాధికారులు ఎండిన పంటలను క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పంట పండించేందుకు చేసిన ప్రయత్నాలన్నీ సాగునీరు అందక రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ తరుణంలో మమ్ముల్ని ఆదుకోవాలంటూ సర్కారును రైతులు వేడుకుంటున్నారు. గత పదేండ్లుగా వ్యవసాయం పండుగలా మారింది. ఈ ఏడాది రబీసీజన్ నుంచి రైతులను కష్టాలు వెంటాడుతున్నాయి. భూగర్భజలాలు రోజురోజుకు తగ్గిపోతుండడంతో వేసిన వరి, మొక్కజొన్న, వేరుశనగ, కూరగాయలతోపాటు అనేక పంటలు ఎండిపోతున్నాయి. కనీసం వరుస తడులు కూడా పారక పొట్టచేతికి వచ్చిన సమయంలో వరిపొలాలు ఎండిపోయాయి. దీంతో వ్యవసాయం చేసేందుకు అప్పులు తీసుకువచ్చిన రైతులకు వాటిని ఎలా తీర్చలా అర్థం కాని పరిస్థితి నెలకొంది. బ్యాంకుల్లో ఇప్పటికే వ్యవసాయ రుణాల బాకీలు వెంటాడుతున్న క్రమంలో యాసంగి పంటకోసం తీసుకువచ్చిన అప్పులు తీర్చేదారి కనిపించక రైతులుఆవేదనకు గురవుతున్నారు.



ఎండిపోయిన మొక్కజొన్నచేనులో రైతు ఆంజనేయులు

**ఎండిన వరిపంట మాత్రమే నమోదు**

ప్రస్తుత సీజన్‌లో ఎండిన పంటలపై సర్వే చేస్తున్నామని వ్యవసాయాధికారులు పైకి చెబుతున్నప్పటికీ వాస్తవంగా ఎండిన వరిపంటను మాత్రమే నమోదు చేస్తున్నారు. వరి, మొక్కజొన్న, వేరుశనగ, దోస, పొద్దుతిరుగుడు, బబ్బెరతోపాటు రైతులు కూరగాయల సాగును సైతం చేపట్టారు. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో వేసిన అన్ని పంటలు చేతికి రాకుండా పోయాయి. కానీ వ్యవసాయాధికారులు మాత్రం ఎండిన వరిపంటను మాత్రమే నమోదు చేస్తామని చెబుతుండటంతో మిగతా పంటలు వేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్కువ నీటితో పంటలు పండించడమే మా తప్పా అని రైతాంగం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నది. ఎండిపోయిన అన్ని పంటలను సర్వేచేసి ఆదుకోవాలని రైతాంగం ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నది.

**పంటలు ఎండిపోయాయి**

ఐదెకరాల భూమిలో నీళ్లు సక్కగా ఎల్లుతాయో లేదోనని రెండు ఎకరాల్లో మక్కపెట్టా. తలపువ్వుకు పీసువచ్చేటైంలా ఎండిపోయిం ది. ఒకనెల అయితే చేతికి వచ్చేది. ఎకరంన్నర పల్లిసేను కూడా వేశా. ఆదికూడా బండబాయిల సరిగ్గా నీళ్లు ఎల్లక ఎండిపోయింది. ఎనభైవేలు అప్పుతీసుకువచ్చి పెట్టా. పంట పండినంక మళ్లీ కడుదామని అనుకున్నా. నేను అప్పు ఎట్లకట్టాలే. మా ముగ్గురు బిడ్డలను ఎలా చదివించాలో అర్థం కావడం లేదు.

-దొంతరబోయిన ఆంజనేయులు, రైతు, హుస్నాబాద్

**పంటలు చేతికి రాకుండా పోయాయి**



ఎకరంన్నర వరి, ఇరువై గుంటల దోస పెట్టా. వేల రూపాయల పెట్టుబడి పెట్టి పంట పెడితే వరి, దోస పంట మొత్తం ఎండిపోయింది. 19 గజాల బాయి కూడా ఎండిపోయింది. అండ్ల వేసిన నిలువు బోరు కూడా దెబ్బతిన్నది. ఇగ అప్పులు తెచ్చి పంటలు సాగుచేస్తే చేతికి రాకుండానే పోయాయి. మాలాంటి రైతులకు సాయం అందించి సర్కారు ఆదుకోవాలి.

- గొర్ల అజయ్, రైతు హుస్నాబాద్



హుస్నాబాద్‌లో ఎండిపోయిన వరిపంటను పరిశీలిస్తున్న ఏఈవో శివరాం

**వివరాలు సేకరిస్తున్నాం**

హుస్నాబాద్ ప్రాంతంలో ఎండిపోయిన పంటలపై అంచనా వేస్తున్నాం. మాకు ఉన్న ఆదేశాల ప్రకారం ఎండిపోయిన వరి పంట వివరాలు సేకరిస్తున్నాం. దీనిపై అన్ని మండలాల ఏవో, ఏఈవోలకు ఆదేశాలు ఇచ్చాం. సాయంత్రం వరకు ఎండిపోయిన వరిపంటపై సమాచారం వస్తుంది. దీన్ని పై అధికారులకు పంపిస్తాం. ఇతర పంటల సమాచారం సేకరించడంలేదు.

-మహేశ్,ఏడీఏ, హుస్నాబాద్

## జూదం స్థావరంపై దాడి

గజ్వేల్, మార్చి 31: గజ్వేల్ పట్టణంలోని తోట చంద్రశేఖర్ ఇంట్లో కొంత మంది వ్యక్తులు జూదం ఆడుతున్నారనే సమాచారంతో ఆదివారం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో జూదం ఆడుతున్న వారి వద్ద నుంచి రూ.23,860 నగదు, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టి.రాజేందర్, సంపత్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, మనోజ్‌కుమార్, విజయ్, భిక్షపతి, కనకరాజు, నరేశ్, వీరబాబు, ప్రేమ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపితే చర్యలు

రాయపోల్, మార్చి 31: గుప్త నిధులకోసం తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని రాయపోల్ ఎస్సై రఘుపతి అన్నారు. రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామ శివారులోని పెద్దగుట్ట సమీపంలోని అటవీ ప్రాంతంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన వ్యక్తులపై కేసు నమోదు చేశామన్నారు. రాంసాగర్ గ్రామానికి చెందిన ఎరుకుల కిష్టయ్య, ఎరుకల రామచంద్రం, గజ్వేల్ మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లికి చెందిన సుంచు పోచయ్య, వస్కుల మహంకాళి స్వా మి, గజ్వేల్‌లో నివాసం ఉండే నరేందర్ గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారని, ఆ ప్రాంతాన్ని ఆదివారం పరిశీలించినట్లు ఆయ న తెలిపారు.



రాయపోల్ మండలం రాంసాగర్ శావారులో పెద్దగుట్టపై గుప్తనిధుల తవ్వకాలపై విచారణ చేస్తున్న రాయపోల్ ఎస్సై రఘుపతి

## రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రం ఆవిష్కరణ

సిద్దిపేట టౌన్,మార్చి 31 : భారత రాజ్యాంగాన్ని బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందిస్తే కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలు, పునాదులను ధ్వంసం చేస్తున్నదని జాతీయ మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి వెన్నరాజు ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం జాతీయ మల మహానాడు ఆధ్వర్యంలో మహనీయుల మహోత్సవాల్లో భాగంగా రాజ్యాంగ రక్షణ యాత్ర కరపత్రాన్ని ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సత్యానారాయణ, దేవయ్య, శ్రీరాములు, సతీశ్,యాదగిరి, శ్రీనివాస్, రాజయ్య,రాజు, రాజేందర్, అరుణ్, రవి,మల్లిఖార్జున్ హరీశ్ తదిరతులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌కు ధోకా లేదు

చేర్యాల, మార్చి 31 : బీఆర్ఎస్‌లో అధికారం అనుభవించిన కేకే, కడియం శ్రీహరి పార్టీ నుంచి వెళ్లిపోయినా గులాబీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీకి ఎలాంటి ధోకా లేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలు యాదవ్ అన్నారు.ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారం పోగానే ఇద్దరు వృద్ధనేతలు లోపాయికారి ఒప్పందంతో కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లిపోయారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ పై ప్రేమ ఉంటే ఎన్నికల ముందే వెళ్లిపోతే పార్టీ శ్రేణులు సంతోషపడేవారన్నారు.కేసీఆర్‌తో దయతో అధికారం అనుభవించి, నక్క వినయాలను ప్రదర్శించి అధికారంలో లేదనే నెపం, అధికార దాహంతో నాయకత్వం మీద ఆరోపణలు చేస్తున్న వారికి గులాబీ శ్రేణులు తగు విధంగా బుద్ధి చెబుతాయన్నారు. లీడర్లు పార్టీలు మారినంత మాత్రనా క్యాడర్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మారిపోరనే విషయాన్ని పార్టీలు మారే వారు గమనించుకోవాలన్నారు. బీఆర్ఎస్‌లో యువ నాయకత్వం ఉందని, పండుటాకులు వెళ్లినంత మాత్రాన బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ శ్రేణులు చిత్తశుద్ధితో పని చేసి ఎంపీలను గెలిపించుకోవాలని, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు.



పర్వతాలుయాదవ్

**82శాతానికి చేరిన పన్ను వసూళ్లు**

హుస్నాబాద్‌టౌన్, మార్చి 31: హుస్నాబాద్ పట్టణంలో ఆస్తిపన్ను వసూళ్లు 82 శాతానికి చేరినట్లు మున్సిపల్ ఇన్‌చార్జి ఆర్‌ఐ జాలిగాం శంకర్ తెలిపారు. ఆస్తిపన్ను వసూలుకు చివరి రోజుకావడంతో పట్టణంలో ప లు వార్డుల్లో వసూలు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన వివరించారు. ఆదివారం సాయంత్రం వరకు 82శాతం పన్నుల వసూ లు జరిగిందని రాత్రి వరకు అనుకున్న లక్ష్యా న్ని చేరేందుకు కృషిచేస్తామని తెలిపారు.

**ఇర్కోడులో కనువిప్పు**

సిద్దిపేటరూరల్, మార్చి31: సిద్దిపేట రూరల్ మండలంలోని ఇర్కోడులో పోలీసులు ఆదివారం కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, మూఢనమ్మకాలు, సైబర్ నేరాలు, గంజాయి మత్తు పదార్థాల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్సై అపూర్వరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

## కోటి తలంబ్రాల దీక్ష



తలంబ్రాలను తయారు చేస్తున్న భక్తులు

వర్గల్, మార్చి 31: మండలంలోని చాంద్‌ఖాన్‌మక్తలో శనివారం రాత్రి కోటి తలంబ్రాల దీక్షలో భక్తులు పాల్గొన్నారు. గోటితో తలంబ్రాలు వలిచారు. వంద మందికిపైగా భక్తులు దీక్షలో పాల్గొన్నారు. రామకోటి భక్త సమాజం అధ్యక్షుడు రామకోటి పాల్గొన్నారు.

## ఫుట్‌బాల్ టాలెంట్ ప్రోగ్రాం

గజ్వేల్, మార్చి 31: జిల్లా యువజన క్రీడా అధికారి, మైనార్టీ పాఠశాల ప్రిన్సిపాల్ సహకారంతో గజ్వేల్ ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల విద్యార్థులకు మైనార్టీ పాఠశాలలో ఫుట్‌బాల్ టాలెంట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని పు ట్‌బాల్ క్లబ్ ఉపాధ్యక్షుడు జంగం రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యం

గజ్వేల్, మార్చి 31: ప్రధాని నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం గజ్వేల్, ములుగు, వర్గల్, జగదేవ్‌పూర్, కుకునూర్‌పల్లి మండలాల కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటును వృథా చేసుకోవద్దని యువతకు సూచించారు. దేశాభివృద్ధికి కృషిచేస్తున్న మోదీకే ఓటు వేయాలన్నారు. ఆయా మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

## కూడవెల్లిలోకి నీటి విడుదలకు ఆదేశం



మంత్రులు పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఉత్తంకుమార్‌రెడ్డి తో మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట, మార్చి 31: తొగుట, మిరుదొడ్డి,దుబ్బాక మండలాల పరిధిలో రైతుల పంటలు ఎండిపోకుండా కూడవెల్లివాగులోకి నీరు విడుదల చేయాలని ఆదివారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌లను కలిసి విజ్ఞప్తి చేయగా వారు సానుకూలంగా స్పందించి వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేశారని కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దుబ్బాక నియోజకవర్గ పరిధిలోని ఎక్కువ మొత్తంలో వరి సాగు చేశారని, వానకాలంలో వర్షపాతం అంతంత మాత్రంగానే ఉండడంతో నీటి లభ్యత లేక భూగర్భజలాలు అడుగంటిపోయి రైతుల పొలాలు ఎండిపోయి ఇబ్బందులు పడుతున్నారని గుర్తుచేశారు. సాగు నీటి విడుదలకు సహకరించిన మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దుబ్బాక నియోజకవర్గ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకుంటామని, నియోజకవర్గ అభివృద్ధికి ము ఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా మంత్రుల సహకారంతో నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మంత్రులను కలిసిన వారిలో తుక్కపూర్ మాజీ సర్పంచ్ చెరుకు విజయ్‌రెడ్డి ఉన్నారు.

## నేటి సమాజానికి సాహిత్యం అవసరం



ఆశుకవితా పద్యధార సాహిత్య కార్యక్రమంలో పాల్గొన్న కవులు

సిద్దిపేట, మార్చి 31: నేటి సమాజానికి సాహిత్యం ఎంతో అవసరమని ప్రముఖ సంస్కృత పద్యకవి దోర్బల ప్రభాకరశర్మ అన్నారు. ఆదివారం సిద్దిపేట సమీపంలోని లలిత చంద్రమౌళీశ్వర దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా అవధానులు ములుగ అంజయ్య, తీగుళ్ల శ్రీకాంతశర్మ ఆధ్వర్యంలో అశు కవితా పద్యధార కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల నృత్యాలు అలరించాయి. చంద్రమౌళీశ్వర దేవాలయ నిర్వాహకుడు పండరి రాధాకృష్ణ, ప్రముఖ పద్య కవులు కంది శంకరయ్య, ఉండ్రాళ్ల రాజేశం, లక్ష్మయ్య, లింగేశ్వరశర్మ, శివకుమార్, మంచినీళ్ల సరస్వతి, మానస, నాగలత, సంధ్యారాణి, బస్వరాజు కుమార్, శిఖాగణేశ్, పద్మ , ఫణీంద్ర పాల్గొన్నారు.

## కేసీఆర్‌తోనే విప్లవాత్మక మార్పులు



బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు హన్మండ్ల రాజిరెడ్డి

రాయపోల్,మార్చి 31 : కేసీఆర్‌తోనే రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు రాజిరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇక్కడికి వచ్చి స్వయంగా అభివృద్ధి పనులు పరిశీలించి అభినందలు తెలిపారని గుర్తు చేశారు మోదీ పాలనలో దేశ ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన పథకాలు నేటికీ గ్రామా ల్లో ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రసుత్తం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. సీఎం, మంత్రులు ఢిల్లీ పెద్దలకు గులాంగిరి చేయడం తప్ప ప్రజలకు చేసిందేమీలేదన్నారు. గ్రామాల్లో సాగు, తాగు నీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభు త్వం మొద్దు నిద్రవీడటం లేదని ఆయన విమర్శించారు. మెదక్ లోక్‌సభ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేసి తెలంగాణ ఆత్మగౌరవాన్ని చాటుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## కరువు భత్యాన్ని విడుదల చేయాలి



మట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి

సిద్దిపేట టౌన్, మార్చి 31 : కరువు భత్యా న్ని వెంటనే విడుదల చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేటలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి, రాజిరెడ్డి, బాలయ్య, భూంరెడ్డి, రామస్వామి పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో ఈస్టర్

చేర్యాల, మార్చి 31 : పట్టణంలోని షాలేము ప్రార్థన మందిరంలో బ్రదర్ అందె విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా విజయ్‌కుమార్ భక్తులకు ప్రేమవిందు ఏర్పాటు చేశారు.

**దుస్తుల పంపిణీ**

ఈస్టర్ పండుగ సందర్భంగా పట్టణంలోని ఇండియా మిషన్ కాంపౌండ్ ఆవరణలో డా.బీ.ఆర్.అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత కర్రోళ్ల నవజీవన్, బెస్ట్ సర్వీస్ సొసైటీ జాతీయ అవార్డు గ్రహీత కర్రోళ్ల అన్నమ్మ దంపతులు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా కర్రోళ్ల దంపతులు మాట్లాడుతూ అన్ని పర్వదినాల్లో తమవంతుగా పేదలకు సహాయం చేస్తున్నామని, సామాజిక సేవే తమ లక్ష్యమన్నారు.

**నవోదయకు సింధుశ్రీ ఎంపిక**

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 31: జవహర్ నవోదయ విద్యాలయం 2024-25 విద్యాసంవత్సరానికి నిర్వహించిన ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ధూళిమిట్ట మండలం రెడ్యానాయక్‌తండాకు చెందిన ధరావత్ విజయ-నర్సింహులుల దంపతుల కూతురు ధరావత్ సింధుశ్రీ ఎంపికైనట్లు ఆదివారం గ్రామస్తులు తెలిపారు. సింధుశ్రీ నవోదయకు ఎంపిక కావడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

**సీతా ఉమామహేశ్వర దేవాలయ వార్షికోత్సవం**

గజ్వేల్, మార్చి 31: గజ్వేల్ పట్టణంలోని సీతా ఉమామహేశ్వర దేవాలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

**నేటి నుంచి తృతీయ వార్షికోత్సవం**

తొగుట, మార్చి 31: మండలంలోని ఎల్లారెడ్డిపేటలో నిర్మించిన రేణుకాఎల్లమ్మ ఆలయంలో నేటి నుంచి తృతీయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు గీత పారిశ్రామిక గౌడ సంఘం సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారి పూజ, పుట్టకు ధని పోయుట, రాత్రి ఎనిమిది గంటలకు ఎల్లమ్మదేవికి బోనాలు తీయడం, మంగళవారం ఉదయం 11: 45 నిమిషాలకు ఎదుర్కొలు, అమ్మవారి పెద్దపట్నం, ఎల్లమ్మదేవి కల్యాణం, ఒడిబియ్యం, మంగళ హారతి, అన్నదానం, రాత్రి ఏడు గంటలకు గావుపట్టుట కార్యక్రమలు నిర్వహిస్తున్నట్లు గౌడ సంఘం సభ్యులు తెలిపారు.